# చదువు

ఈనాడు హైదరాబాద్ బుధవారం ఫిబ్రవరి 14, 2018 ■ e-mail: edc@eenadu.in



## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**రైట్స్ లిమిటెడ్‌లో ఇంజినీర్లు**

గుడ్‌గావ్‌లోని రైట్స్ లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన ఎలక్ట్రికల్/ మెకానికల్ విభాగాల్లో 30 ఇంజినీర్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది.

**అర్హత:** మొదటి శ్రేణిలో ఇంజినీరింగ్ డిగ్రీతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.02.2018 నాటికి 32 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 22.02.2018.

**రాతపరీక్ష, ఇంటర్వ్యూ తేది:** 24, 25.02.2018.

**వెబ్‌సైట్:** http://rites.com/

**ఇస్రోలో సైంటిస్టులు**

బెంగళూరులోని ఇస్రో హెడ్‌క్వార్టర్స్ కింది విభాగాల్లో సైంటిస్ట్/ ఇంజినీర్-ఎస్‌సీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

**విభాగాలు-ఖాళీలు:** సివిల్- 14, ఎలక్ట్రికల్- 6, రెఫ్రిజిరేషన్ & ఎయిర్ కండిషనింగ్- 7, ఆర్కిటెక్చర్- 1. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 13.02.2018 నుంచి 05.03.2018.

**రాత పరీక్ష తేది:** 22.4.2018

**వెబ్‌సైట్:** www.isro.gov.in

### వాక్ ఇన్స్

**ఎన్ఐఎన్‌లో సీనియర్ ప్రాజెక్ట్ రిసెర్చ్ ఫెలో**

జాతీయ పోషకాహార సంస్థ ఒక సీనియర్ ప్రాజెక్ట్ రిసెర్చ్ ఫెలో పోస్టు భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

**అర్హత:** ఎంఎస్సీ (న్యూట్రిషన్/ బయోకెమిస్ట్రీ), నెట్ ఉత్తీర్ణత.

**రాత పరీక్ష/ ఇంటర్వ్యూ తేది:** 20.02.2018.

**వేదిక:** ఎన్ఐఎన్, తార్నాక, హైదరాబాద్.

**వెబ్‌సైట్:** http://ninindia.org/

**ఎన్ఐపీహెచ్ఎం, హైదరాబాద్**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ కింది పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

**పోస్టు-ఖాళీలు:** సీనియర్ కన్సల్టెంట్- 1, సీనియర్ రిసెర్చ్ ఫెలో (నెమటాలజీ/ ఎంటమాలజీ/ ప్లాంట్, సీడ్ పాథాలజీ)- 7, జూనియర్ రిసెర్చ్ ఫెలో- 04.

**అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, నెట్ ఉత్తీర్ణత.

**వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీలు:** ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు. **వేదిక:** ఎన్ఐపీహెచ్ఎం, రాజేంద్రనగర్, హైదరాబాద్.

**వెబ్‌సైట్:** http://niphm.gov.in/

### ప్రవేశాలు

**ఐఐఎస్సీలో యూజీ ప్రోగ్రాం**

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (రిసెర్చ్) ప్రోగ్రాం ప్రవేశ ప్రకటన విడుదలైంది.

**అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణత.

**ఎంపిక:** కేవీపీవై, ఐఐటీ-జేఈఈ/ అడ్వాన్స్‌డ్ లేదా నీట్ యూజీ మార్కుల ఆధారంగా.

**దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 30.04.2018. **వెబ్‌సైట్:** www.iisc.ac.in

**ఐఐటీటీఎంలో బీబీఏ**

గ్వాలియర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ అనుబంధ కేంద్రాల్లో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ టూరిజం, ట్రావెల్ ప్రోగ్రాంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

**సీట్ల సంఖ్య:** 240 **అర్హత:** 50% మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత. **వయసు:** 01.07.2018 నాటికి 22 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** ప్రవేశ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 15.05.2018. **పరీక్ష తేది:** 03.06.2018.

**వెబ్‌సైట్:** www.iittm.ac.in

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

## గ్రాఫిక్ డిజైన్‌లో..

**తాజా ఇంటర్న్‌షిప్స్**



**›› కంటెంట్ రైటింగ్**

సంస్థ: Muditva Industries
ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/i/8967
గడువు: ఫిబ్రవరి 20, 2018 **అర్హులు:** ఆంగ్లభాషా (రాత) నైపుణ్యాలు ఉన్నవారు.

**›› ఆపరేషన్స్**

సంస్థ: Practo Technologies
ప్రదేశం: చెన్నై, హైదరాబాద్, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.2000
లింకు: internshala.com/i/8969
గడువు: ఫిబ్రవరి 20, 2018
అర్హులు: ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

**డిజిటల్ మార్కెటింగ్**

సంస్థ: Muditva Industries
ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/i/8970
గడువు: ఫిబ్రవరి 20, 2018
**అర్హులు:** ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

**›› గ్రాఫిక్ డిజైన్**

సంస్థ: Nevvee Advertising
ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ.6000
లింకు: internshala.com/i/8968
**గడువు:** ఫిబ్రవరి 20, 2018 **అర్హులు:** అడోబ్ ఇలస్ట్రేటర్, అడోబ్ ఇన్‌డిజైన్ నైపుణ్యాలు ఉన్నవారు.

**›› డిజిటల్ మార్కెటింగ్**

సంస్థ: Bala Vikasa ప్రదేశం: వరంగల్, హైదరాబాద్ **స్టైపెండ్:** నెలకు రూ.5000 **లింకు:** internshala.com/i/8971 **గడువు:** ఫిబ్రవరి 20, 2018
**అర్హులు:** సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

మరిన్ని ఇంటర్న్‌షిప్‌లకు www.eenadupratibha.net చూడవచ్చు.

---

**యూజీసీ నెట్ - 2018**



విద్యారంగంలో ప్రమాణాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అర్హత పరీక్షలను తప్పనిసరి చేసింది. విశ్వవిద్యాలయాల్లోనూ, డిగ్రీ కళాశాలల్లోనూ అధ్యాపకులుగా చేరాలంటే యూజీసీ నెట్ ఉత్తీర్ణులై ఉండాలి. పరిశోధన రంగంలోకి ప్రవేశించాలన్నా ఈ పరీక్షలో అర్హత సాధించాల్సిందే. ఇటీవల కొన్ని మార్పులతో నెట్ ప్రకటన వెలువడింది. సబ్జెక్టులకు సంబంధించి అభ్యర్థుల సమగ్ర అవగాహనను, అన్వయ నైపుణ్యాలను పరీక్షిస్తారు. సానుకూల దృక్పథంతో సరైన అధ్యయన ప్రణాళికను అభ్యర్థులు రూపొందించుకోవాలి.

# బోధన.. పరిశోధనల్లోకి ప్రామాణిక మార్గం!

బోధన, పరిశోధన రంగాల్లో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పే లక్ష్యంతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్ఈటీ) నిర్వహిస్తోంది. అర్హులైన నిపుణులను అందించడమే ఈ పరీక్ష ప్రధాన ఉద్దేశం. ఇందులో అర్హత పొందినవారు విశ్వవిద్యాలయాలు; డిగ్రీ, పీజీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ (సహాయ ఆచార్యులు)గా ఉద్యోగాలు పొందవచ్చు. పరిశోధన రంగంలోకి ప్రవేశించవచ్చు. అందుకోసం జులై 2009 నుంచి ఈ పరీక్ష ఉత్తీర్ణతను తప్పనిసరి చేశారు. ప్రస్తుతం నెట్‌ను యూజీసీ తరపున న్యూదిల్లీలోని సీబీఎస్ఈ నిర్వహిస్తోంది. పరీక్ష జులై 8న జరగనుంది.



డాక్టర్ వి. బ్రహ్మం

దరఖాస్తు చేసే ప్రతి అభ్యర్థికీ తప్పనిసరిగా ఆధార్ నెంబర్ ఉండాలి. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేయాలి. దరఖాస్తులు ప్రారంభం: 6 మార్చి, 2018. చివరితేదీ: 5 ఏప్రిల్, 2018. పరీక్ష ఫీజు జనరల్ విభాగం అభ్యర్థులకు రూ. 600. ఓబీసీలకు రూ. 300. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వారికి రూ. 150. పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించడానికి చివరి తేది 6 ఏప్రిల్, 2018.

## కనీస అర్హతలు

సంబంధిత సబ్జెక్టులో పీజీని 55 శాతం మార్కులు లేదా తత్సమాన గ్రేడ్‌తో పూర్తి చేసి ఉండాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగానికి వయసుకి సంబంధించి గరిష్ఠ పరిమితి లేదు. జేఆర్ఎఫ్ (జూనియర్ రిసెర్చ్ ఫెలో) పరీక్ష రాసే అభ్యర్థులకు 1 జనవరి, 2018 నాటికి 30 సంవత్సరాల వయసు మించకూడదు. ఎస్సీ ఎస్టీ, ఓబీసీ (నాన్-క్రిమిలేయర్), పీడబ్ల్యూడీ (దివ్యాంగులు) అభ్యర్థులకు గరిష్ఠ వయసులో 5 సంవత్సరాల సడలింపు ఉంటుంది.

## రెండు పేపర్లు

ఈ పరీక్షకు గతంలో మూడు పేపర్లు ఉండేవి. ఈ సంవత్సరం నుంచి రెండు పేపర్లకు తగ్గించారు. పేపర్-1 అభ్యర్థులందరికీ కామన్‌గా ఉంటుంది. పేపర్-2 ఎంచుకున్న సబ్జెక్టు ప్రకారం ఇస్తారు. పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఓఎంఆర్ తరహాలో జరుగుతుంది.

పేపర్-1లో 50 ప్రశ్నలను వంద మార్కులకు ఇస్తారు. దీన్ని ఒక గంటలో (ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర గంటల వరకు) పూర్తిచేయాలి.

పేపర్-2లో 100 ప్రశ్నలను 200 మార్కులకు ఇస్తారు. దీన్ని రెండు గంటల్లో (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు) రాయాలి. నెగిటివ్ మార్కులు ఉండవు.

జనరల్ అభ్యర్థులు ప్రతి పేపర్‌లో 40 శాతం, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు 35 శాతం కనీస మార్కులు సాధించాలి.

## మెరిట్‌లో ఉంటేనే!

నెట్‌లో కేవలం పాస్ మార్కులు సాధిస్తే సరిపోదు. ప్రతి సబ్జెక్టు, ప్రతి కేటగిరీ నుంచి మెరిట్ జాబితా తయారు చేస్తారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్ఎఫ్ రెండింటికీ వేర్వేరుగా అభ్యర్థుల ఎంపిక జాబితా ఉంటుంది. ఆ మెరిట్ జాబితాలోనూ టాప్ 6 శాతం వారిని మాత్రమే నెట్ అర్హత సాధించినట్లుగా ప్రకటించి సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ఉదాహరణకు...

■ కిందివాటిలో మంచి ప్రశ్నపత్రం లక్షణానికి సంబంధంలేని అంశం?

ఎ) లక్ష్యాత్మకత (Objectivity)
బి) వ్యక్తి నిష్ఠత (Subjectivity)
సి) విశ్వసనీయత (Reliability)
డి) సప్రమాణత (Validity)

జవాబు: బి

■ భారత ప్రభుత్వం ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనాభా గణన కార్యక్రమం చేపడుతుంది. ఇందులో వాడే పద్ధతి?

ఎ) కేస్ స్టడీ బి) పరిపృచ్ఛ
సి) సర్వే పద్ధతి డి) ప్రయోగాత్మక పద్ధతి

జవాబు: సి

### ప్రిపరేషన్ విధానం

జాతీయ స్థాయి పీజీ సిలబస్ బోధనలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడానికి ఉద్దేశించిన పరీక్ష కావడంతో ఎక్కువగా ప్రశ్నలు అవగాహన, అన్వయం, విశ్లేషణ నైపుణ్యాలను అంచనా వేసే విధంగా ఉంటాయి. అందువల్ల అభ్యర్థులు ప్రతి అంశాన్ని పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి.

ఎంచుకున్న సబ్జెక్టు సిలబస్‌ను పలుమార్లు పరిశీలించి పట్టు పెంచుకోవాలి.

■ గత ప్రశ్నపత్రాలను పరిశీలించి ముఖ్యమైన అంశాలు, భావనలను గుర్తించాలి. వాటి ఆధారంగా సన్నద్ధతను కొనసాగించాలి. ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్ సేకరించుకోవాలి.

■ ప్రాథమిక భావనలను, ముఖ్యమైన అంశాలను సమగ్రంగా, విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి.



■ పునశ్చరణ అవిచ్ఛిన్నంగా జరగాలి.

■ మోడల్ పేపర్లు సాధన చేయాలి. తప్పులు జరిగితే, వాటిని పరిశీలించి అధ్యయనంలో తగిన మార్పులు చేసుకోవాలి. కేవలం ఆ ప్రశ్నకు సమాధానమే కాకుండా, ఆ భావనలకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా చదవాలి.

■ సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి. ప్రణాళిక ప్రకారం నిరంతర సాధన కొనసాగిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు.

### ప్రధాన మార్పులు

- కొత్త పరీక్షా విధానాన్ని అనుసరించి 3 పేపర్లకు బదులు 2 పేపర్లు ఉంటాయి.
- గతంలో పేపర్-1లో 60 ప్రశ్నలు ఉండేవి. వాటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉండేది. ఇప్పుడు 50 ప్రశ్నలే ఇస్తారు. అన్నింటికీ 60 నిమిషాల్లో జవాబులు గుర్తించాలి.
- ఎంచుకున్న సబ్జెక్టుకి సంబంధించి ఇంతకు ముందు రెండు పేపర్లు ఉండేవి. ఇప్పుడు దాన్ని ఒక పేపర్‌కి తగ్గించారు. అదే పేపర్-2. ఇందులో 100 ప్రశ్నలు ఇస్తారు. కేటాయించిన సమయం 2 గంటలు.
- జేఆర్ఎఫ్‌కి వయసు పరిమితి 30 సంవత్సరాలు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు ఉంది.

**గమనించాల్సిన అంశాలు**

- అభ్యర్థులకు ఆధార్ నెంబరు తప్పనిసరి.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు హైదరాబాద్, వరంగల్, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిల్లో ఉన్నాయి.
- గత సంవత్సరం పరీక్షకు దాదాపు 9.3 లక్షలమంది దరఖాస్తు చేశారు. వారిలో దాదాపు 7 లక్షల మంది హాజరయ్యారు.

పేపర్-2లో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్టు నుంచి పీజీ స్థాయి ప్రశ్నలు వస్తాయి. సిలబస్ ప్రకారం అధ్యయనం చేయాలి. అకడమిక్ పరీక్షలకు చదివినట్లు బట్టీపడితే దెబ్బ తింటారు. సబ్జెక్టును పూర్తిగా అర్థం చేసుకొని, అన్వయించగలిగిన సామర్థ్యాన్ని పొందే విధంగా చదవాలి.

బీఈడీ, ఎంఈడీ కోర్సులు పూర్తిచేసినవారికి మిగతా అభ్యర్థుల కంటే టీచింగ్ ఆప్టిట్యూడ్, రిసర్చ్ ఆప్టిట్యూడ్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్ సులభంగా అనిపిస్తాయి. అయితే, మిగతా అభ్యర్థులు కూడా తమ పాఠశాల దశలోని అనుభవాలను పునశ్చరణ చేసుకుంటే వారికి ఆ అంశాలు సులువుగానే అర్థమవుతాయి.

మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్‌కు సంబంధించిన సిలబస్ అన్ని పోటీ పరీక్షలకు ఒకేలా ఉంటుంది. కాబట్టి, ఎలాంటి ఆందోళన, భయం అవసరం లేదు. సాధన బాగా చేస్తే చాలు.

■ పేపర్-2లో వచ్చే అంశాలు అన్నీ అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో చదివిన సబ్జెక్టులే ఉంటాయి. అయితే, అప్పుడు వ్యాస, సంక్షిప్త సమాధాన రూపంలో అభ్యసించిన అంశాలు, భావాలకు ఎన్ఈటీ కోసం బహుళైచ్ఛిక ప్రశ్నల విధానంలో సన్నద్ధం కావాలి.

■ ప్రశ్నలు ఎక్కువగా మన జ్ఞానాన్ని, అవగాహనా శక్తిని, విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఉంటాయి. నిర్ణీత సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. కాబట్టి, సంబంధిత సబ్జెక్టుపై మంచిపట్టు ఉండాలి.

■ మాదిరి ప్రశ్నపత్రాల ఆధారంగా సిలబస్‌ను అనుసరించి వివిధ రిఫరెన్స్ పుస్తకాలతో సన్నద్ధత ప్రారంభించండి. విజయాన్ని మీ సొంతం చేసుకోండి.

**వెబ్‌సైట్:** http://cbsenet.nic.in

---

# ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్



**వైద్యవిద్యలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పి నిపుణులైన వైద్యులను దేశానికి అందించే లక్ష్యంతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఏర్పడింది. అండర్‌గ్రాడ్యుయేషన్, పీజీ స్థాయిల్లో మెడికల్, పారామెడికల్ కోర్సులను అందిస్తోంది. ఎంబీబీఎస్‌లో ప్రవేశాల కోసం ఈ సంస్థ ఇటీవల ప్రకటన వెలువరించింది. అర్హత సాధించిన అభ్యర్థులు న్యూదిల్లీలోని ఎయిమ్స్‌తోపాటు ఇతర ప్రఖ్యాత సంస్థల్లో కూడా సీటు పొందే అవకాశం ఉంది.**

మెడిసిన్ కోర్సులకు అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్), న్యూదిల్లీ జాతీయస్థాయిలో ఎంతో ప్రఖ్యాతమైంది. ఈ సంస్థలో ఎంబీబీఎస్ సీటు లభించడం అభ్యర్థుల కెరియర్‌లో చక్కటి మలుపుగా భావించవచ్చు. దేశవ్యాప్తంగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. పోటీ ఎక్కువగానే ఉంటుంది. ఎయిమ్స్ న్యూదిల్లీతోపాటు భోపాల్, భువనేశ్వర్, మంగళగిరి, జోధ్‌పూర్, నాగ్‌పూర్, పట్నా, రాయ్‌పూర్, రిషికేశ్ కేంద్రాల్లో ప్రవేశాలు లభిస్తాయి. అన్ని చోట్లా కలిపి 800 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ పరీక్షలో అభ్యర్థి చూపిన ప్రతిభ ద్వారా ప్రవేశం లభిస్తుంది. .

## పరీక్ష ఇలా...

మొత్తం 200 ప్రశ్నలు వస్తాయి. వీటిలో మల్టిపుల్ ఛాయిస్‌తోపాటు రీజన్ - అసెర్షన్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (బోటనీ, జువాలజీ) ఒక్కో సబ్జెక్టు నుంచి 60 చొప్పున ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు జనరల్ నాలెడ్జ్ నుంచి 10, ఆప్టిట్యూడ్, లాజికల్ థింకింగ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్షకు మూడున్నర గంటల సమయం కేటాయించారు. 140 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, 60 రీజన్, అసెర్షన్ ప్రశ్నలు వస్తాయి. జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్‌లో రీజన్, అసెర్షన్ ప్రశ్నలు ఉండవు. ప్రతి సరైన సమాధానానికీ ఒక మార్కు. తప్పుగా గుర్తించిన ప్రతి ప్రశ్నకు ఒక మార్కులో మూడోవంతు చొప్పున తగ్గిస్తారు. పరీక్షలో అర్హత సాధించడానికి జనరల్ అభ్యర్థులు 50, ఓబీసీ 45, ఎస్సీ, ఎస్టీలు 40 శాతం మార్కులు సాధించాలి. ఈ విధంగా రూపొందించిన అర్హుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తారు.

మొత్తం సీట్లు 800. మంగళగిరి, నాగ్‌పూర్ క్యాంపస్‌ల్లో 50 చొప్పున ఉన్నాయి. మిగిలిన అన్ని చోట్లా వందేసి ఉంటాయి. మంగళగిరి క్యాంపస్ విద్యార్థులకు తాత్కాలికంగా విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో తరగతులు నిర్వహిస్తారు. కోర్సు వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులో ఏడాది తప్పనిసరి ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

**విద్యార్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీలతో ఇంటర్మీడియట్ లేదా ప్లస్2 ఉత్తీర్ణత. ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో జనరల్, ఓబీసీ అభ్యర్థులు 60 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధించాలి. ప్రస్తుతం రెండో సంవత్సరం కోర్సు చదువుతున్నవాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**వయసు:** డిసెంబరు 31, 2018 నాటికి 17 ఏళ్లు (జనవరి 2, 2002 తర్వాత జన్మించినవాళ్లు అనర్హులు)

**ఆన్‌లైన్ దరఖాస్తులు:** మార్చి 5 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు.

**దరఖాస్తు, రిజిస్ట్రేషన్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీలకు రూ.1200

**అడ్మిట్ కార్డులు:** మే 10 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**పరీక్ష:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ విధానంలో మే 26, 27 తేదీల్లో రోజుకి రెండు విడతల చొప్పున నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12:30; మధ్యాహ్నం 3 నుంచి 6:30 వరకు ఉంటాయి.

**పరీక్షా కేంద్రాలు:** ఆంధ్రప్రదేశ్‌లో చీరాల, గుంటూరు, కర్నూలు, కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం; తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.

**ఫలితాలు:** జూన్ 18న ప్రకటిస్తారు.

**వెబ్‌సైట్:** www.aiimsexams.org